క్లుప్తంగా

'హైదరాబాద్‌కు తరలిరండి'

బుట్టాయగూడెం: లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో ఆ సంఘ నాయకులు చాప రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమం జరుగుతుందని, ఎంఆర్‌పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గవరవరంలో సుదర్శన హోమం



సత్యనారాయణ స్వామి ఆలయంలో సుదర్శన హోమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరంలోని కొలువైన శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహస్వామి హోమం నిర్వహించారు. హోమ క్రతువును మండల బ్రాహ్మణ సంక్షేమ యూత్ సభ్యుల సమక్షంలో జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి వెంకటరమణచార్యుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు మండపారాధన విశేష పూజలు చేశారు. అనంతరం 20 దంపతులతో హోమ పూజలు శాస్త్రోక్తంగా చేశారు. లోక కల్యాణార్థం హోమాన్ని నిర్వహించినట్లు బ్రాహ్మణ పరిషత్ తెలిపింది. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

రేపు పారిజాతగిరిలో రథసప్తమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 4వ తేదీ రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలియజేశారు. మంగళవారం ఉదయం 9:30కు సూర్యప్రభ వాహన సేవ అనంతరం ఆలయ ఈశాన్య భాగంలో ప్రత్యేకంగా నిర్మించబడిన కోనేరులో సుదర్శన పెరుమాల్‌కు చక్ర స్నానం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహం పొందాల్సిందిగా ఈవో కోరారు.

భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తికావడంతో ఆదివారం సాయంత్రం నుంచి రైల్వే అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించారు. 10 రోజుల తర్వాత ఈ గేటు ద్వారా వాహనాల రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల 22న ట్రాక్ అత్యసర మరమ్మతు పనుల కారణంగా రైల్వే గేటును ఉన్నతాధికారులు మూసివేసారు. దీనితో రైల్వే శాఖ ఈ ట్రాక్ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గడువు సమయం కన్నా ఒక రోజు ముందుగానే పూర్తి చేసారు. అనంతరం ఈ గేటు ద్వారా వాహనాల రాకపోకలు సాగించేందుకు అనుమతిచ్చారు. దీనితో జిల్లా వ్యాప్తంగా భీమడోలు మీదుగా ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు తీరాయి.

ముద్రగడ ఇంటిపై దాడి దుర్మార్గం

దెందులూరు: కాపు నేత, రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి దేనికి సంకేతమని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు దెందులూరు నియోజకవర్గం కాపు సంఘం అధ్యక్షుడు పోకల రాంబాబు, సీనియర్ నేత తోట పద్మారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఇంటి గేటును ట్రాక్టర్‌తో ఢీ కొట్టి, ఆవరణలోకి వెళ్లి ఆయన కారును సైతం ఢీ కొట్టారన్నారు. ముద్రగడ పద్మనాభం బెదిరింపులకు భయపడే వ్యక్తి కాదని పద్మారావు అన్నారు. దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పోలీసులు విచారణ చేసి నిందితులను, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాపు సంఘం నేతలు డిమాండ్ చేశారు. ముద్రగడ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని పోకల రాంబాబు, తోట పద్మారావు అన్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం 2025–26కు ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్లో చేనేత రంగాలకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేనేత కార్మికులను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఏపీ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆది శేషు ఆదివారం ఓ ప్రకనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చేనేత రంగానికి రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేనేతకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా కార్పొరేట్ కోసమే తప్ప సామాన్యులకు కాదని ఆయన విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలపై త్వరలో ఉద్యమం చేపడతామని ఆది శేషు హెచ్చరించారు.

కాలుష్యం కోరల్లో పల్లెసీమలు



మెట్ట ప్రాంతంలోని ఒక పట్టణంలో పెరిగిన వాహనాల రద్దీ



కాలం చెల్లిన ఆర్టీసీ బస్సు సైలెన్సర్ నుంచి వస్తున్న నల్లని పొగ

- విపరీతంగా పెరిగిన వాహనాల వినియోగం
- పర్యావరణానికి పెనుసవాల్‌గా మారిన వైనం
- కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు శూన్యం

చింతలపూడి: గ్రామీణ ప్రాంతాలపై కాలుష్య భూతం కోరలు చాస్తోంది. మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం ఇలా అన్నీ కాలుష్యమవుతున్నాయి. ప్రభుత్వ పరంగా కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రమే కావడంతో కాలుష్య భూతం ఇప్పుడు పట్టణాల నుంచి పల్లెలకు కూడా తరలివస్తోంది. ఈ మధ్య కాలంలో పల్లె ప్రాంతాల్లో సైతం వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. పల్లె పల్లెలోను వందలాది వాహనాలు దర్శనమిస్తున్నాయి. ఈ వాహనాలు విడుస్తున్న పొగ ద్వారా వచ్చే కాలుష్యం పల్లె ప్రాంతాలను కలుషితం చేస్తోంది. దీనికి తోడు పెట్రోల్, డీజిల్లో కల్తీల వల్ల ఈ వాహనాల ఇంజన్ల ద్వార వచ్చే కాలుష్యం అంతా, ఇంతా కాదు. రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరగడం, కాల పరిమితి దాటిన వాహనాలు వాడుతున్న కారణంగా కూడా కాలుష్యం పెరిగిపోయింది. నేడు కాలుష్యం లేని ప్రాంతమంటూ లేకపోవడం విశేషం. దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్యంతో అనారోగ్యాలు

వాయు కాలుష్యం కారణంగా అనేక అనారోగ్యాలు దరిచేరే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. వాయు కాలుష్యం వల్ల ప్రధానంగా ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఇటీవల ఒక అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా వాహనాల ద్వారా విడుదలవుతున్న కాలుష్యంలో ఆర్సినిక్, సీసం, నికెల్ వంటి భారలోహ ధాతువులు గాలిలో కలిసి జీవ కోటికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని శాస్త్రవేత్తల అభిప్రాయం. వాహనాలు విడుదల చేస్తున్న పొగవల్ల మనకు రక్షణ కలిగిస్తున్న ఓజోన్ పొర దెబ్బతింటోందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు కూడా విపరీతమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఈ వాయు కాలుష్యం వల్ల ఎక్కువగా ప్రజలు శ్వాస, కోశ వ్యాధులకు లోనవ్వడం, గొంతు నొప్పి, ఆయాసం, జలుబు, దగ్గు వంటి వ్యాధులకు లోనై మృత్యు వాత పడుతున్నారు.

అంతటా వాయు కాలుష్యం

జిల్లాలో ప్రస్తుతం 5,27,683 వాహనాలు ఉన్నాయి. వాటిలో 1,41,292, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కాగా, 3,86,391 నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు రహదారులపై తిరుగుతున్నాయి. ఇవి కాక ద్విచక్ర వాహనాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి సుమారు 10 లక్షల వాహనాల వరకు జిల్లాలో తిరుగుతున్నాయని అంచనా. ఈ వాహనాల్లో అత్యధికంగా కార్లు, లారీలు, బస్సులు, టూ వీలర్స్ వల్ల 56.2 శాతం, ఆటోలు, ఇతర వాహనాల వల్ల 34 శాతం పొగ కాలుష్యం వ్యాపిస్తున్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే, ప్రజలు కూడా కాలుష్యపై అవగాహన పెంపొందించుకోవాలని, మొక్కలు నాటాలని, వీలైనంత వరకు మోటార్ వాహనాలను పక్కన పెట్టడం అలవాటు చేసుకోవాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

చెట్ల పెంపకం ఒక్కటే మార్గం



కాలుష్యం బారి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే చెట్ల పెంపకాన్ని విరివిగా చేపట్టాలి. అంతరించిపోతున్న అడవులను తిరిగి పునరుద్ధరించుకోవాలి. అవసరం ఉంటే తప్ప మోటారు వాహనాలను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైకిల్ వినియోగం పెరగాలి. పెట్రోల్, డీజిల్ రహిత వాహనాల వినియోగం కూడా పెంచాలి. – కంభం విజయరాజు, రవాణాశాఖ జిల్లా మాజీ అధికారి

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



కాలుష్య నియంత్రణపై అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలి. తరచూ వాహనాల తనిఖీలు నిర్వహించాలి. కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులపై దాడులు జరిపి కాలుష్య నియంత్రణకు నడుం బిగించాలి. లేదా పచ్చని పల్లెలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని బుగ్గిపాలవ్వడం ఖాయం. – పిదపర్తి ముత్తారెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్‌ఎఫ్

చింతలపూడి: స్థానిక శ్రీచైతన్య కళాశాలలో ఆదివారం తరగతులు నిర్వహిస్తుండగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో నారాయణ కళాశాలలో చరణ్ అనే విద్యార్థి ఒత్తిడికి గురయ్యి మరణించిన ఘటన తెలిసినా ప్రైవేట్ విద్యాసంస్థలు తమ పోకడను మార్చుకోకపోవడం దారుణమన్నారు. సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై విద్యాశాఖాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డి.సన్నీ, కె.రాజేష్, టీ నాని, కె కిరణ్ పాల్గొన్నారు.

మాఘమాస పూజలు ప్రారంభం



విశేష అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

కొయ్యలగూడెం: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఉపాలయమైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఆదివారం మాఘ మాస పూజలు ప్రారంభించారు. మాఘమాస సందర్భంగా నాలుగు ఆదివారాలు కూడా ప్రాతఃకాలం పూజలు అభిషేక అర్చనాది కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారికి భానువాసర పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, శ్రీ లక్ష్మీ కరావలంబ స్తోత్రం పారాయణం, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా మరియతల్లి ఉత్సవాలు



మరియతల్లిని దర్శించి వస్తున్న భక్తులు

చింతలపూడి: అల్లిపల్లి కొండపై నిర్వహిస్తున్న మరియతల్లి ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా ఈ ఉత్సవాలను జరిపారు. క్రైస్తవ వాక్యంలోని దివ్య సందేశాలను భక్తులు గ్రహించి పరివర్తనతో ముందుకు సాగాలని క్రైస్తవ గురువులు అన్నారు. అనంతరం పలువురు గురువులచే సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా నుంచే కాక ఖమ్మం, కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కూడా మేరీమాత భక్తులు ఈ ఉత్సవాలకు భారీగా తరలివచ్చారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ. 2,00,005 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా గణపవరంనకు చెందిన ఎస్వీ సుబ్బారావు రూ.లక్ష, తాళ్లముదునూరుపాడుకు చెందిన సత్తి శ్రీనివాసరెడ్డి రూ.1,00,005 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

'వేల గొంతులు, లక్ష డప్పులు' జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడు రాజేశ్వరరావు పిలుపు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడు రాజేశ్వరరావు, తదితరులు

ద్వారకాతిరుమల: ఎస్సీ వర్గీకరణ అమలుకై ఈనెల 7న హైదరాబాదులో జరిగే వేల గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడు బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. ద్వారకాతిరుమలలోని వైష్ణవి ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో వేల గొంతులు, లక్ష డప్పులు గోడ పత్రికను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుంచి, మాదిగ జాతికి చెందిన ప్రతి ఒక్కరు డప్పు చేత పట్టుకొని హైదరాబాద్ తరలిరావాలని కోరారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం యావత్ మాదిగ జాతికే గర్వకారణమని అన్నారు, ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఆయన ముందుకు సాగారని, చెప్పులు కుట్టిన చేతులతోనే చరిత్ర రాస్తామని, ఆయన ముందుగానే చెప్పారని గుర్తు చేశారు. ఈనెల 7న జరిగే కార్యక్రమం ప్రపంచంలోనే ఒక సాంస్కృతిక విప్లవం అవుతుందని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నమ్మిన నాగార్జున మాదిగ, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు మాదిగ, మండల అధ్యక్షుడు కంకిపాటి గాంధీ మాదిగ, కోకన్వీనర్ జునుపూడి సిద్దయ్య మాదిగ, మద్దాల వెంకటేశ్వరరావు మాదిగ, ఉండుర్తి రమణ మాదిగ, చిలక వీర స్వామి మాదిగ, ఏపూరి కిషోర్ మాదిగ, నల్లంటి రామారావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో పాదయాత్ర పూర్తి



అచ్యుతాపురంలో దుర్గా ప్రసాద్‌కి వీడ్కోలు పలుకుతున్న మహిళలు

కొయ్యలగూడెం: ఏలూరు నుంచి కాకినాడ వరకు చేపట్టిన పాదయాత్ర ఏలూరు జిల్లాలో పూర్తయిందని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ ఆదివారం పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే సంకల్పంతో జనవరి 27వ తేదీన చేపట్టిన పాదయాత్ర ఫిబ్రవరి 2వ తేదీతో జిల్లాలో పూర్తయింది అన్నారు. ఏలూరు, చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల మీదుగా వారం రోజుల్లో 165 కిలోమీటర్ల మేర నిర్వహించిన పాదయాత్రకు ప్రజల వద్ద నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. అచ్యుతాపురం శివారు జిల్లా సరిహద్దు నుంచి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించే నేపథ్యంలో మహిళలు దుర్గాప్రసాద్‌కి మంగళ హారతులతో వీడ్కోలు పలికారు. వారం రోజులు చేపట్టిన పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి గురునాథరావు, ముఖ్య నాయకులు ఇళ్ల భాస్కరరావు, దాసరి విష్ణు, పోల్నాటి బాబ్జి, జుజ్జవరపు విజయనిర్మల, పోల్నాటి బాబ్జి, అలుగు ఆనందశేఖర్, కొప్పుల ప్రభాకర్‌రెడ్డి, తమ్మీ, బొడ్డు వెంకటేశ్వరరావు, రామరాజు నాయక్, గంజిమాల రామారావు, తుమ్మలపల్లి గంగారాజు, మట్టా సత్తిపండు తదితరులు ఆశీర్వదించి అభినందనలు తెలిపారని అన్నారు.

చింతాలమ్మ ఆలయ కమిటీ సమావేశం



చింతాలమ్మ ఆలయ కమిటీపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ బాధ్యత పదకొండు మందికి అప్పగిస్తూ తీర్మానం చేశారు. టెంపుల్స్ సెంటర్లోని మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షునిగా ఏడుగురు వ్యక్తుల పేర్లు పరిగణలోకి రాగా ఏకాభిప్రాయం కొరవడడంతో అధ్యక్ష ఎంపికను వాయిదా వేయాల్సి వచ్చింది. దాదాపు వంద మందికి పైగా గ్రామంలోని ముఖ్యులు హాజరు కాగా వారిలో భేదాభిప్రాయాలు పొడసూపాయి. చివరకు చైర్మన్ ఎంపిక బాధ్యతను పదకొండు మందికి అప్పగిస్తూ వారి నిర్ణయం మేరకే చైర్మన్ పదవి ఆశిస్తున్న ఏడుగురు నడుచుకోవాల్సిందిగా అజెండా జారీ చేశారు. కాగా సమావేశ నిర్వహణపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మే నెలలో అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులు కొత్తగా ఏర్పాటు కాబోయే కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమవుతుందని సమావేశం పేర్కొంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కన్నాపురం జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన 1986-87 నాటి పదో తరగతి విద్యార్థులు

కొయ్యలగూడెం: కన్నాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1986–87 సంవత్సరంలో పదవ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థులంతా కలుసుకుని, నాటి మధుర స్మృతులు నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. హైస్కూల్ అభివృద్ధికి రూ.లక్ష విలువైన యూపీఎస్ సాంకేతిక సామగ్రిని విద్యార్థుల సౌకర్యార్థం అందజేశారు. దివంగతులైన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆకుల సత్య సూరిబాబు, గొడ్డటి నాగేశ్వరరావు, బొమ్మా మురళీకృష్ణ, అబ్బూరి చంద్రకళ, కె.మురళీకృష్ణమరాజు, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం



కాపు కల్యాణ మండప అభివృద్ధిపై చర్చిస్తున్న ట్రస్ట్ చైర్మన్ వాసుబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో పలు అభివృద్ధి పనులకు పాలక మండలి ఆమోదముద్ర వేసింది. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం పాలక మండలి సమావేశం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ మండప సముదాయంలోని ఆంజనేయ కల్యాణ మండప అభివృద్ధికి, 32 సీసీ కెమెరాల ఏర్పాటుకు, అలాగే రూ.3.50 లక్షలతో వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటుకు రూపొందించిన అంచనాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నమిల్లి వెంకటరాయుడు, ట్రెజరర్ మాకా శ్రీనివాస్, సభ్యులు మైగాపుల మోహన్, అందే మహేష్, పాశం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ తక్షణం ఇంటి స్థలం కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): కూటమి నాయకులు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు తక్షణమే ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), ఏలూరు 2వ డివిజన్‌లో అడ్డగర్ల లక్ష్మీ ఇందిర ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్జీల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డేగా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టణ ప్రాంతాల్లో సెంటు భూమిని రెండు సెంట్లుగా మార్పు చేసి, పట్టాలు జారీ చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న పూర్తి చేసిన అర్జీలను కలెక్టర్‌కు అందించే కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏలూరు జిల్లా సమితి సభ్యులు బళ్ల కనక దుర్గారావు, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి పాల్గొన్నారు.

విదేశీ పక్షుల సందడి



పానకాల చెరువు చెట్లపై విదేశీ పక్షుల కోలాహలం

చింతలపూడి : చింతలపూడి సమీపంలో ఉన్న పానకాల చెరువు వద్ద విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఒకప్పుడు పక్షుల విడిదికి ఈ ప్రాంతం కూడా ప్రసిద్ధి చెందింది. సైబీరియా, ఆస్ట్రేలియ, కెనడా దేశాల నుంచి సుమారు 13 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించి ప్రతి ఏటా కొల్లేరు ఆటపాక పక్షుల సంరక్షణా కేంద్రానికి వచ్చే పక్షులు అక్కడి నుంచి పానకాల చెరువుకు వచ్చి వెళ్తుంటాయి. అయితే వేటగాళ్ల స్వార్థం కారణంగా పక్షుల వలస రావడం రాను రాను బాగా తగ్గిపోయింది. చెరువులో పక్షుల నివాసం కోసం నాటిన చెట్లు కూడా కనుమరుగవుతున్నాయి. దీంతో ఇక్కడ పక్షులకు రక్షణ కరువయ్యింది. అయినా కొన్ని రకాల పక్షులు మాత్రం క్రమం తప్పకుండా ఏటా ఇక్కడికి వచ్చి గుడ్లు పెట్టి పిల్లలను పొదుగుతాయి. పిల్లలకు ఎగిరే వయస్సు వచ్చాక వాటి స్వస్థలాలకు తిరుగు ప్రయాణమవుతాయి. దాదాపు వేసవి వచ్చే వరకు ఇక్కడే నివాసం ఉండి సంతానోత్పత్తి చేసుకుని చుట్టు పక్కల గ్రామాల ప్రజలను కనువిందు చేస్తుంటాయి.